సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం

ఆదివారం । 4 । జూన్ । 2023



బడిబాట సక్సెస్ చేయాలి

పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించేందుకు చేపట్టిన బడిబాటను విజయవంతం చేయాలని డీఈఓ సోమశేఖర శర్మ అన్నారు. 10లో



విద్యుత్ సమస్యలకు చెక్

కొత్తగూడెం జిల్లా కేంద్రంలో విద్యుత్ సమస్య పరిష్కారానికి చేపట్టిన 132/33 సబ్ స్టేషన్ పనులు త్వరలోనే పూర్తి కానున్నాయి. 10లో

గరిష్ఠం / కనిష్ఠం
42° / 28°

వాతావరణం

జిల్లాలో ఆదివారం ఎండ తీవ్రత అధికంగా ఉంటుంది. గంటగంటకూ ఉష్ణోగ్రత పెరుగడంతో పాటు వడగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

వైభవంగా శ్రీబాలాజీ కల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

అన్నపురెడ్డిపల్లి: మండల కేంద్రంలో కొలువుదీరిన శ్రీబాలాజీ వేంకటేశ్వరస్వామి వారి కల్యాణం శనివారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. మొదట స్వామివారికి అర్చన, అభిషేకం తదితర పూజలు చేశారు. అనంతరం ఆలయ ప్రధానార్చకులు ప్రసాదాచార్యులు ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా కల్యాణం జరిపించారు. ఆ తర్వాత అన్నమాచార్యుల కీర్తనలు గానం చేశారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

రేపటి ప్రజావాణి రద్దు

కొత్తగూడెంఅర్బన్: దశాబ్ది ఉత్సవాలు నిర్వహిస్తున్నందున ఈనెల 5న నిర్వహించాల్సిన ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు కలెక్టర్ అనుదీప్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ సిబ్బంది మొత్తం రాష్ట్ర అవతరణ వేడుకలకు హాజరవుతున్నందున ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు. ఈ విషయాన్ని ప్రజలంతా గమనించాలని కోరారు.

నేడు సురక్ష దినోత్సవం

- విజయవంతం చేయాలని ఎస్పీ పిలుపు

కొత్తగూడెంటౌన్: జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఆదివారం సురక్ష దినోత్సవం నిర్వహిస్తున్నట్లు ఎస్పీ డాక్టర్ వినీత్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ వేడుకలకు ప్రజలు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు. నేడు ఉదయం లక్ష్మీదేవిపల్లి సెంట్రల్ పార్క్ నుంచి కలెక్టరేట్ వరకు, తిరిగి అక్కడి నుంచి ఇల్లెందు క్రాస్‌రోడ్ మీదుగా కొత్తగూడెంలోని గణేష్ టెంపుల్, విద్యానగర్ కాలనీ బైపాస్ రోడ్డు మీదుగా ప్రకాశం స్టేడియం వరకు పోలీసు వాహనాలతో భారీ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు వివరించారు. సాయంత్రం 4 గంటలకు హేమచంద్రాపురంలోని జిల్లా పోలీసు హెడ్ క్వార్టర్స్‌లో పోలీసుల పనితీరును వివరించేలా స్టాల్స్‌తో పాటు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నామని పేర్కొన్నారు. ఈ వేడుకలకు ప్రజలు, ప్రజాప్రతినిధులు భారీగా హాజరై విజయవంతం చేయాలని కోరారు.

అప్పులతోనే పాలన సాగిస్తున్నారు

- ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్



మాట్లాడుతున్న కేఏ పాల్

కొత్తగూడెంఅర్బన్: అప్పులతోనే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పాలన సాగిస్తున్నాయని ప్రజాశాంతి పార్టీ వ్యవస్థాపకులు డాక్టర్ కేఏ పాల్ విమర్శించారు. శనివారం కొత్తగూడెంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రం రూ.లక్షల కోట్ల అప్పుల ఊబిలో కూరుకుపోయిందన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే మరింతగా దివాళా తీయిస్తారని, బీజేపీకి రాష్ట్రంలో స్థానమే లేదని అన్నారు. మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డిని ప్రజాశాంతి పార్టీలోనికి ఆహ్వానిస్తున్నామని, ఆయన తమ పార్టీలోకి వస్తే ఉమ్మడి ఖమ్మం జిల్లాలో అన్ని సీట్లలోనూ గెలుస్తారని చెప్పారు. తాను కొత్తగూడెంలో దాదాపు 350 మందికి ఉచితంగా చదువులు చెప్పించానన్నారు. నిరుద్యోగులకు ఉద్యోగాలు రావాలన్నా, బలహీన వర్గాల రాజ్యం రావాలన్నా ప్రజాశాంతి పార్టీకి మద్దతు ఇవ్వాలని కోరారు. అనంతరం పాల్ ప్రకాశం స్టేడియం వద్దకు వెళ్లి తాను 25 ఏళ్ల క్రితం కొత్తగూడెం వచ్చినప్పుడు ఈ గ్రౌండ్‌లోనే హెలీకాప్టర్ ల్యాండ్ అయిందని గుర్తు చేసుకుంటూ గ్రౌండ్‌లోకి వెళ్లేందుకు గోడ దూకే ప్రయత్నం చేశారు. ఆయన వెంట పార్టీ నాయకులు జీవన్ తదితరులు ఉన్నారు.

రేపు విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో వేడుకలు

కొత్తగూడెంరూరల్: తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా సోమవారం విద్యుత్ విజయోత్సవ డే నిర్వహిస్తున్నట్లు విద్యుత్ శాఖ ఎస్ఈ కె.రమేష్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 5న చుంచుపల్లి మండలం ఎన్‌కే నగర్‌లోని కమ్మ సత్రంలో నిర్వహించే వేడుకల్లో ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు పాల్గొంటారని తెలిపారు. ఇల్లెందులోని ఎస్ఎస్ గార్డెన్స్‌లో నిర్వహించే కార్యక్రమానికి అక్కడి ఎమ్మెల్యే బానోతు హరిప్రియ, అశ్వారావుపేటలో గిరిజన భవన్‌లో జరిగే కార్యక్రమంలో ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు, భద్రాచలంలో జరిగే కార్యక్రమంలో ఎమ్మెల్యే పొదెం వీరయ్య, పినపాకలో జరిగే కార్యక్రమంలో ఎమ్మెల్యే రేగా కాంతారావు పాల్గొంటారని వివరించారు.

పట్టాతో పాటు సాయం

పోడు రైతులకు అందనున్న రైతుబంధు, బీమా

- వివరాలు సేకరిస్తున్న అధికారులు
- ఈనెల 24 నుంచి పట్టాల పంపిణీ
- జిల్లాలో 50, 595 మందికి లబ్ధి



ఇల్లెందు మండలంలో పోడు సాగు చేస్తున్న రైతు (ఫైల్)

మంచుపల్లి: పోడు రైతుల దశాబ్దాల కల నెరవేరే సమయం ఆసన్నమైంది. ఏళ్లుగా ఎదురుచూస్తున్న గిరిజనుల పోడు సమస్య పరిష్కారం కానుంది. ప్రస్తుత దశాబ్ది ఉత్సవాల్లోనే రైతులకు హక్కు పట్టాలను జారీ చేయనుంది. వాటితో పాటు రైతుబంధు పథకాన్ని కూడా వర్తింపజేయాలని సర్కారు నిర్ణయించింది. ఈ నెల 24 నుంచి 30 వరకు పట్టాల పంపిణీ చేయాలనే ప్రభుత్వ ఆదేశాలతో అధికారులు చర్యలు చేపట్టారు. స్వయంగా సీఎం కేసీఆర్ జిల్లాకు వచ్చి పోడు పట్టాలు పంపిణీ చేసే అవకాశాలున్నట్లు తెలిసింది. వచ్చే వానాకాలం సీజన్ నుంచే రైతుబంధు, రైతుబీమా పథకాలు కూడా అందజేయనున్నారు. పోడు హక్కుపత్రాలు స్వీకరించే రైతులకు ఈనెల 10 లోపే బ్యాంకు ఖాతాలు తెరవాలని కలెక్టర్లకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. దీంతో లబ్ధిదారుల పేరున బ్యాంకు ఖాతా తెరిపించేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. గ్రామ పంచాయతీ కార్యదర్శితో పాటు ఇతర సిబ్బంది గ్రామాలకు వెళ్లి పోడు రైతుల వివరాలు సేకరిస్తున్నారు.

మొత్తం దరఖాస్తులు 83,341..

జిల్లాలో పోడు హక్కు పట్టాల కోసం మొత్తం 83,341 దరఖాస్తులు రాగా, వాటి పరిధిలో 2.97 లక్షల ఎకరాల భూములు సాగులో ఉన్నట్లు తేలింది. ఇందులో 65,616 మంది గిరిజనులు 2,41,102 ఎకరాలకు పట్టాల కోసం దరఖాస్తు చేయగా వాటిలో పలు కారణాలతో 15,021 దరఖాస్తులు తిరస్కరణకు గురయ్యాయి. మిగిలిన 50,595 దరఖాస్తులకు తాజాగా డీఎల్సీ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. అటవీ హక్కుల చట్టం – 2005 ప్రకారం గిరిజనేతరులు పోడు భూములపై హక్కులు పొందాలంటే మూడు తరాలుగా అటవీ ప్రాంతంలో నివాసితులై ఉండాలి. ఆ మేరకు జిల్లాలో వచ్చిన 17,725 గిరిజనేతరుల దరఖాస్తులను జిల్లా కమిటీ పెండింగ్‌లో పెట్టింది. ప్రస్తుతం కమిటీ ఆమోదం పొందిన 50,595 దరఖాస్తుల పరిధిలో 1,51,195 ఎకరాల భూములకు ఈ నెల 24 నుంచి హక్కు పట్టాలు జారీ చేయనున్నారు.

పోడు పట్టాల అర్హులు వివరాలు

నియోజకవర్గం	దరఖాస్తులు	పంపిణీ చేసే భూమి (ఎకరాల్లో)
అశ్వారావుపేట	9,363	27,870.39
భద్రాచలం	6,508	17,302.03
కొత్తగూడెం	4,508	16,769.19
పినపాక	15,971	53,353.14
ఇల్లెందు	12,445	31,155.38
వైరా (జూలూరుపాడు)	1,800	4743.07

జిల్లాలో 1,51,195 ఎకరాలకు పట్టాలు..

పోడు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలనే ఉద్దేశంతో ప్రభుత్వం 2021 నవంబర్‌లో అర్హులైన పోడు సాగుదారుల నుంచి దరఖాస్తులు స్వీకరించింది. అయా దరఖాస్తుల ప్రకారం ఎఫ్ఆర్సీ కమిటీల ఆధ్వర్యంలో పోడు భూముల సర్వే చేపట్టారు. అయితే ప్రభుత్వం గిరిజనులకు మాత్రమే హక్కు పట్టాలు ఇవ్వాలని నిర్ణయించింది. దీంతో పోడు దరఖాస్తులపై రెండు సార్లు కసరత్తు చేసి చివరకు 50,595 దరఖాస్తులను (గిరిజనుల) జిల్లాస్థాయి కమిటీ ఆమోదానికి సబ్ డివిజనల్ కమిటీ సిఫారసు చేసింది. దాదాపు దాన్నే జిల్లా అధికారుల కమిటీ తుది జాబితాగా ఆమోద ముద్ర వేసింది. ఇప్పటికే వాటికి పోడు హక్కుపత్రాలు, పాస్ పుస్తకాలను సైతం ముద్రించి పంపిణీకి సిద్ధంగా ఉంచారు. జిల్లాలో 313 గ్రామపంచాయతీల పరిధిలో 717 ఆవాస గ్రామాల్లో పోడు సాగులో ఉన్నట్లు అటవీశాఖ గుర్తించింది. రాష్ట్రంలో అత్యధికంగా భద్రాద్రి జిల్లాలోనే పోడు పట్టాలు జారీ చేయనుండడం విశేషం.

రైతును రాజు చేయడమే లక్ష్యం

- ప్రాజెక్టులు, చెక్‌డ్యామ్‌లతో బీడు భూములూ సస్యశ్యామలం
- రైతుబంధు, బీమాతో అన్నదాతలకు అండ
- దశాబ్ది వేడుకల్లో కలెక్టర్ అనుదీప్, ఎమ్మెల్యే వనమా



లక్ష్మీదేవిపల్లి మండలం లోతువాగులో రైతును సన్మానిస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే

పాల్వంచరూరల్/సుజాతనగర్/కొత్తగూడెంరూరల్: రైతులకు అన్ని విధాలా సహాయ సహకారాలు అందించి వారిని రాజు చేయడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని కలెక్టర్ అనుదీప్ అన్నారు. జిల్లాలోని సుజాతనగర్, పాల్వంచ మండలం జగన్నాథపురం, లక్ష్మీదేవిపల్లి మండలం లోతువాగు రైతు వేదికల్లో శనివారం నిర్వహించిన రైతు దినోత్సవ కార్యక్రమాల్లో కొత్తగూడెం ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావుతో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గత తొమ్మిదేళ్లలో వ్యవసాయరంగంలో ప్రగతిని గుర్తుచేసుకునేలా ఈ వేడుకలు నిర్వహిస్తున్నామని తెలిపారు. రైతుబంధు, రైతు బీమా పథకాలతో ప్రభుత్వం అన్నదాతలకు అండగా నిలిచిందన్నారు. రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం నిరంతరం పని చేస్తోందన్నారు. రాయితీపై వ్యవసాయ పనిముట్లు, విత్తనాలు సరఫరా చేయడంతో పాటు పంటలకు గిట్టుబాటు ధర కల్పిస్తోందని చెప్పారు. ప్రకృతి వైపరీత్యాల నుంచి నష్టపోకుండా ఉండేందుకు ముందస్తు సాగు మేలని అన్నారు. ప్రభుత్వం వ్యవసాయ రంగానికి ప్రాధాన్యత ఇవ్వడంతో పాటు వ్యవసాయ శాస్త్రవేత్తల సలహాలు, సూచనలతో కొత్త పంటలు సాగు చేయించడం వల్లే రైతులు అభివృద్ధి చెందుతున్నారని చెప్పారు. సంప్రదాయ పంటలను విడనాడి ప్రత్యామ్నాయ పంటల సాగుతో లాభాలు సాధించాలని, భూసారాన్ని మెరుగుపర్చుకోవాలని సూచించారు. ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ.. వ్యవసాయానికి 24 గంటల పాటు విద్యుత్ సౌకర్యం కల్పించిన ఘనత కేసీఆర్‌దే అన్నారు. ఏ రాష్ట్రంలోనూ లేని విధంగా తెలంగాణలో రైతుబంధు, రైతుబీమా పథకాలు అమలు చేస్తున్నారని చెప్పారు. రైతులు పండించిన ధాన్యం దళారుల పాలు కాకుండా ప్రభుత్వమే గిట్టుబాటు ధరకు కొనుగోలు చేస్తోందని తెలిపారు. కొత్తగూడెం నియోజకవర్గంలో తాను పేదలకు 30 వేల ఇళ్లు నిర్మించి ఇచ్చానని, ఇంకా అర్హులకు కూడా మంజూరు చేస్తామని చెప్పారు. అయా రైతు వేదికల్లో జరిగిన వేడుకలకు రైతులు ట్రాక్టర్లు, ఎడ్లబండ్లతో ప్రదర్శనగా వచ్చారు. కలెక్టర్ సైతం తెల్లటి పంచెకట్టుతో రైతులా వేడుకలకు హాజరు కావడం విశేషం. సుజాతనగర్‌లో కలెక్టర్, ఎమ్మెల్యే, ఎస్పీ వినీత్ తదితరులు రైతులతో కలిసి సహపంక్తి భోజనాలు చేశారు. ఉత్తమ రైతులను ఘనంగా సన్మానించారు. అయా కార్యక్రమాల్లో జెడ్పీ వైస్ చైర్మన్ కంచర్ల చంద్రశేఖర్‌రావు, డీసీఎంఎస్ వైస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు, ఉద్యాన శాఖాధికారి జినుగు మరియన్న, ఎంపీపీలు మడవి సరస్వతి, భూక్యా సోనా, తహసీల్దార్లు రంగాప్రసాద్, నాగరాజు, ఎంపీడీఓ బి.అప్పారావు, మార్కెట్ చైర్మన్ భూక్యా రాంబాబు, వ్యవసాయ శాఖ అధికారులు కరుణశ్రీ, శంకర్, జి.నర్మద, భీముడు, పీఏసీఎస్ చైర్మన్ మండె వీరహనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

నా రూటే సపరేటు !

- పంచకట్టుతో ట్రాక్టర్ నడుపుతూ కలెక్టర్



పాల్వంచరూరల్ : నిత్యం విధుల్లో బిజీగా ఉండే కలెక్టర్ దురిశెట్టి అనుదీప్.. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా శనివారం పాల్వంచ మండలం జగన్నాథపురంలో నిర్వహించిన రైతు సదస్సుకు అన్నదాత వేషధారణలో ట్రాక్టర్ నడుపుతూ హాజరయ్యారు. రొటీన్‌కు భిన్నంగా తెల్లని షర్టు, పంచె ధరించిన ఆయన మెడలో ఆకుపచ్చ కండువా ధరించి అచ్చం రైతులా రావడంతో ఆసక్తిగా తిలకించారు. కలెక్టర్ ట్రాక్టర్ నడుపుతుండగా, ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు, డీఎస్పీ రెహమాన్ చెరో పక్కన కూర్చున్నారు.

కొమరారంలో రైతుల నిరసన



కొమరారం రైతు వేదికలో నిర్వహించిన వేడుకల్లో ఆగ్రహం వ్యక్తం చేస్తున్న రైతులు

ఇల్లెందురూరల్: మండలంలోని కొమరారం రైతు వేదికలో శనివారం నిర్వహించిన వేడుకల్లో స్థానిక రైతులు నిరసన తెలిపారు. ఇటీవల భారీ వర్షాలతో పంట నష్టపోయిన రైతులకు సాయం ఇవ్వలేదని, భారీ వర్షంలో పంటలు తడవకుండా రైతులు ఇబ్బంది పడుతున్నా కొనుగోలు చేయడంలో నిర్లక్ష్యం చేశారని ఆరోపించారు. ఈ ప్రాంతంలో ఒక్కరికి కూడా డబుల్ బెడ్‌రూం ఇళ్లు మంజూరు చేయలేదని అసహనం వ్యక్తం చేశారు. దీంతో పోలీసులు వారిని అడ్డుకుని శాంతింపజేశారు. అంతకుముందు ఎమ్మెల్యే హరిప్రియ మాట్లాడుతూ.. తొమ్మిదేళ్లగా సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలతో వ్యవసాయం పండుగలా మారిందన్నారు. ఆ తర్వాత సుదిమళ్ల రైతు వేదిక వద్దకు ట్రాక్టర్ తోలుకుంటూ వచ్చి రైతులను ఉత్సాహపర్చారు. రైతు దినోత్సవ కేక్‌ను కట్ చేశారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ దిండిగాల రాజేందర్, రైతుబంధు సమితి రాష్ట్ర సలహాదారు పులిగళ్ల మాధవరావు, పీఏసీఎస్ చైర్మన్ మెట్టెల కృష్ణ, ఎంపీపీ చీమల నాగరత్నమ్మ, డీసీసీబీ డైరెక్టర్ జనగం కోటేశ్వరరావు, తహసీల్దార్ కృష్ణవేణి, ఏడీఏ వాసవీరాణి, ఏఓ సతీష్ పాల్గొన్నారు.

రామయ్యకు వైభవంగా సువర్ణ తులసీ అర్చన



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు



రామాలయంలో దీపాలు వెలిగిస్తున్న ఈఓ, భక్తులు

భద్రాచలం: భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి వారికి శనివారం సువర్ణ తులసీ అర్చన నిర్వహించారు. తెల్లవారుజామున స్వామి వారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం జరిపించారు. అనంతరం స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్య కల్యాణ వేడుకను అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. వారాంతపు సెలవు రోజులు కావడంతో భక్తులు పెద్ద ఎత్తున అర్జిత సేవల్లో పాల్గొన్నారు.

జ్యేష్ఠాభిషేకానికి అంకురార్పణ

భద్రాచలం శ్రీ సీతారామ చంద్రస్వామి ఆలయంలో శనివారం జ్యేష్ఠాభిషేక మహోత్సవానికి అర్చకులు అంకురార్పణ చేశారు. మేళతాళాల నడుమ పవిత్ర గోదావరి నుంచి తీర్థజలాలను తీసుకొచ్చి యాగశాలలో ప్రత్యేక పూజలు చేశారు. ఆదివారం జ్యేష్ఠ పూర్ణిమ సందర్భంగా స్వామివారికి స్నపన తిరుమంజనం, ఏరువాక పూజలు జరపనున్నారు. రాష్ట్ర అవతరణ దశాబ్ది వేడుకల్లో భాగంగా రామాలయంలో దీపోత్సవం నిర్వహించారు.

10న లోక్ అదాలత్



మాట్లాడుతున్న జడ్జి పాటిల్ వసంత్

కొత్తగూడెంటౌన్: ఈనెల 10వ తేదీన జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి పాటిల్ వసంత్ తెలిపారు. శనివారం జిల్లా కోర్టు కాన్ఫరెన్స్ హాల్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. బీమా కంపెనీల ప్రతినిధులు తమ కేసులను లోక్ అదాలత్‌లో రాజీమార్గం ద్వారా పరిష్కరించుకోవాలని సూచించారు. మోటర్ వాహన ప్రమాద బాధితుల కేసుల్లో కక్షిదారులకు న్యాయం చేయాలన్నారు. లోక్ అదాలత్‌లో రాజీ పడడం వల్ల కక్షిదారులకు సమయం, డబ్బు వృథా కాకుండా ఉంటాయని చెప్పారు. సమావేశంలో మొదటి అదనపు జిల్లా న్యాయమూర్తి ఎం.శ్యాంశ్రీ, జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి జి.భానుమతి, మొదటి అదనపు సీనియర్ సివిల్ జడ్జి ఎ.నీరజ, కొత్తగూడెం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రమేష్‌కుమార్ మక్కడ్, వైస్ ప్రెసిడెంట్ రమేష్, మానిటరింగ్ కమిటీ సభ్యులు జీవీకే మనోహర్ రావు, ఏజీపీ బాపూరావు, ఎస్వీ రామారావు, పురుషోత్తమరావు, మెండు రాజమల్లు, కొత్తపల్లి రామారావు, గాది రామచంద్రారెడ్డి, రావి విజయ్‌కుమార్, అంబటి రమేష్, జిల్లా ఆర్టీసీ స్టాండింగ్ కౌన్సిల్ ఎ.రామ్ ప్రసాదరావు పాల్గొన్నారు.

తొలిరోజే వంద శాతం హాజరు ఉండాలి

ఐటీడీఏ పీఓ గౌతమ్ పొట్రు



అధికారులకు సూచనలు చేస్తున్న ఐటీడీఏ పీఓ

భద్రాచలం: గిరిజన సంక్షేమ శాఖ విద్యాలయాల్లో పాఠశాలల ప్రారంభం రోజే విద్యార్థులు వంద శాతం హాజరయ్యేలా పర్యవేక్షించాలని ఐటీడీఏ పీఓ గౌతమ్ పొట్రు ఆదేశించారు. భద్రాచలంలోని ఐటీడీఏ కార్యాలయంలో శనివారం ఆయన ఏసీఎంఓలు, ఏటీడీఓలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పీఓ మాట్లాడుతూ ఆరో తరగతి నుంచి పదో తరగతి వరకు విద్యార్థులు హాజరయ్యేలా చూస్తూ తొలిరోజే పాఠ్యపుస్తకాలు, యూనిఫాం, కాస్మోటిక్స్ అందజేయాలని తెలిపారు. అలాగే, మెనూ ప్రకారం భోజనం అందించేలా సామగ్రి సిద్ధం చేసుకోవాలని సూచించారు. బడిబాటలో భాగంగా హెచ్ఎంలు అన్ని గ్రామాల్లో ప్రజాప్రతినిధులతో కలిసి తల్లిదండ్రులకు ప్రభుత్వ పాఠశాలల్లోని సౌకర్యాలపై అవగాహన కల్పించాలని తెలిపారు. ఇక తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో ఈనెల 12 నుంచి 22వ తేదీ వరకు గిరిజన విద్యాలయాలలో గిరిజన సంబరాలు నిర్వహించాలని సూచించారు. పదో తరగతిలో ఫెయిల్ అయిన విద్యార్థులు అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించేలా బోధించాలని తెలిపారు. ఈ సమావేశంలో గురుకులాల ఇన్‌చార్జ్ ఆర్‌సీఓ, ఇన్‌చార్జ్ డీడీ డేవిడ్‌రాజ్, అధికారులు రమణయ్య, రాములు, నర్సింగరావు, రూపాదేవి, తిరుమలరావు, చంద్రమోహన్, అలివేలు మంగతాయారు తదితరులు పాల్గొన్నారు.

విద్యాప్రాంగణాలను తీర్చిదిద్దండి

ఈనెల 12 నుంచి పాఠశాలలు పునఃప్రారంభం కానున్నందున ఆశ్రమ పాఠశాలలు, వసతి గృహాలను శుభ్రం చేయించాలని ఇన్‌చార్జ్ డీడీ డేవిడ్ రాజ్ ఏటీడీఓలను ఆదేశించారు. ఐటీడీఏ కార్యాలయంలో ఈఈ ట్రైబల్ వెల్ఫేర్ తానాజీతో కలిసి ఏటీడీఓలతో సమావేశమైన ఆయన పలు సూచనలు చేశారు.

ఏదీ.. ఆనాటి వైభవం !

- రాష్ట్ర విభజనతో తగ్గిన ఐటీడీఏ పరిధి
- జిల్లాల పునర్విభజనతో పాలన అయోమయం
- విద్య, వైద్యం, స్వయం ఉపాధి, ఉద్యోగ రంగాల్లో మెరుగు



భద్రాచలం ఐటీడీఏ కార్యాలయం

భద్రాచలం: తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం తర్వాత సమీకృత గిరిజనాభివృద్ధి సంస్థ (ఐటీడీఏ) గత వైభవం కోల్పోయింది. గిరిజనుల అభివృద్ధి పరంగా కొంత ముందంజలో ఉన్నా పరిపాలన పరంగా నిస్తేజంగా మారింది. విద్య, వైద్యం, స్వయం ఉపాధి, ప్రైవేట్ రంగంలో గిరిజనులకు ఉపాధి కల్పించడం వంటి అంశాల్లో తనదైన ముద్ర వేసుకున్నప్పటికీ.. నాలుగు జిల్లాలతో సంబంధం లేకుండా కొనసాగుతున్న ఐటీడీఏను పునర్ వ్యవస్థీకరించాలనే డిమాండ్లు వినిపిస్తున్నాయి.

32 మండలాలకే సేవలు పరిమితం..

గిరిజనుల సర్వతోముఖాభివృద్ధి కోసం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఖమ్మం జిల్లా కేంద్రంగా 1975 మార్చి 12న ఐటీడీఏను ఏర్పాటు చేశారు. 1979 డిసెంబర్ 17న పాల్వంచకు మార్చారు. ఏజెన్సీలో గిరిజనులకు అందుబాటులో ఉండాలనే ఉద్దేశంతో 1993 ఫిబ్రవరి 9న భద్రాచలంలోని నూతన భవనంలో కార్యకలాపాలు ప్రారంభించారు. నాడు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో భౌగోళికంగా విస్తీర్ణంలో అతి పెద్దదిగా ఉన్న ఈ ఐటీడీఏ.. 2014లో రాష్ట్ర విభజనతో పరిస్థితి తారుమారయింది. గిరిజనులు అధికంగా ఉండే చింతూరు, వీఆర్‌పురం, కూనవరం, వేలేరుపాడు, కుక్కునూరు మండలాలు ఏపీలో కలవడంతో ఐటీడీఏ పరిధి కుచించుకుపోయి ప్రస్తుతం 32 మండలాలకే ఐటీడీఏ సేవలు పరిమితమయ్యాయి.

మెరుగైన గిరిజనాభివృద్ధి..

రాష్ట్ర విభజన అనంతరం ఐటీడీఏ పరిధిలో గిరిజనుల సంఖ్య తగ్గినప్పటికీ ఉన్నవారికి వసతుల కల్పనలో, వారిని అన్ని రంగాల్లో తీర్చిదిద్దడంలో అధికారులు సఫలీకృతమయ్యారు. 2014కు ముందు 14 గురుకుల విద్యాలయాలు మాత్రమే ఉండగా ప్రస్తుతం 27కు పెరిగాయి. ఇందులో 11 గురుకుల పాఠశాలలను అప్‌గ్రేడెడ్ రెసిడెన్సియల్ జూనియర్ కళాశాలలుగా మార్చారు. పాల్వంచ, గుండాల మండలాల్లో రెండు క్రీడా పాఠశాలలు ఏర్పాటయ్యాయి. ఆశ్రమ పాఠశాలల్లో ఇంగ్లిష్ మీడియం బోధన అందుబాటులోకి వచ్చింది. ఐటీడీఏ పరిధిలోని పీహెచ్‌సీల్లో వైద్య సిబ్బంది పోస్టుల భర్తీ అయ్యాయి. ప్రస్తుతం భద్రాచలం ఏరియా ఆస్పత్రిలో నాలుగు రాష్ట్రాల గిరిజనులకు మెరుగైన సేవలు అందుతున్నాయి. ఈ ఆస్పత్రిలో మాతా, శిశు సంరక్షణ కేంద్రం, రక్త నిధి ఆధునికీకరణ, క్యాంటీన్‌లకు ఐటీడీఏ నిధులు కేటాయించింది. గిరిజన యువతకు స్వయం ఉపాధి రంగాలతో పాటు ప్రభుత్వ, ప్రైవేట్ ఉద్యోగాల సాధనకు శిక్షణ ఇస్తోంది. 2014 తర్వాత వైటీసీ ద్వారా 13,237 మంది విద్యార్థులకు రూ.10.41 కోట్ల నిధులు ఖర్చు చేసింది. మహిళలకు స్వయం ఉపాధి కల్పించడంతో పాటు యూనిట్ల ఏర్పాటుకు రుణాలను మంజూరు చేసి వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దింది. స్వయం ఉపాధి రంగంలో ట్రైకార్, డ్రైవర్ ఎంపవర్‌మెంట్, గ్రామీణ రవాణా పథకం, ఎంఎస్ఎంఈల ద్వారా సబ్సిడీ రుణాలు అందించి వారి ఆర్థికాభివృద్ధికి ఐటీడీఏ తోడ్పడింది. వివిధ జాతులకు చెందిన గిరిజన, ఆదివాసీల సంస్కృతి సంప్రదాయాలను కాపాడడంతో పాటు మారుమూల గ్రామాలకు రహదారి, విద్యుత్ సౌకర్యాలు కల్పించింది.

పునర్ వ్యవస్థీకరణకు డిమాండ్

ప్రస్తుతం ఉన్న ఐటీడీఏ పరిధిని పునర్ వ్యవస్థీకరించాలనే డిమాండ్ ప్రధానంగా వినిపిస్తోంది. ప్రస్తుతం భద్రాచలం ఐటీడీఏ పరిధిలో జిల్లాలోని 23 మండలాలతో పాటు ఖమ్మం జిల్లాలోని 5, ములుగు జిల్లాలోని 2, మహబూబాబాద్ జిల్లాలోని 2 మండలాలు ఉన్నాయి. అయితే జిల్లాల విభజన అనంతరం సంస్థలో పాలనాపరంగా సమస్యలు ఎదురవుతున్నాయి. ములుగు జిల్లాలోని వెంకటాపురం, వాజేడు, మహబూబాబాద్ జిల్లాలోని గార్ల, బయ్యారం మండలాలు భద్రాచలం ఐటీడీఏ పరిధిలో ఉన్నాయి. ఈ మండలాల్లో గిరిజనాభివృద్ధికి ఐటీడీఏ నిధులు కేటాయిస్తున్నా.. వాటిపై స్థానిక అధికారులు పర్యవేక్షణ చేయలేకపోతున్నారు. ములుగు జిల్లాలోని రెండు మండలాలను ఏటూరు నాగారం ఐటీడీఏలో కలిపే అవకాశం ఉంది. అలాగే ఖమ్మం జిల్లాలోని ఐదు మండలాలకు మహబూబాబాద్ జిల్లాలోని రెండు మండలాలు అతి దగ్గరగా ఉంటాయి. ఈ ఏడింటిని కలిపి ఖమ్మంలో మినీ ఐటీడీఏ కేంద్రం ఏర్పాటు చేయాలని గిరిజన సంఘాలు కోరుతున్నాయి. తద్వారా పాలన సులభం అవుతుందని అంటున్నాయి.

క్లుప్తంగా

రామయ్యకు వితరణ


ఈఓకు వాటర్ కూలర్ అందచేస్తున్న ఏఈఓ దంపతులు

భద్రాచలం: భద్రాచలంలో శ్రీ సీతారామ చంద్ర స్వామి వారికి పలువురు భక్తులు శనివారం వస్తువులను వితరణగా అందచేశారు. దేవస్థానం ఏఈఓ ఎస్.భవానీ రామకృష్ణారావు దంపతులు భక్తుల తాగునీటి కోసం వాటర్ కూలర్‌ను ఈఓ రమాదేవికి ఇచ్చారు. అలాగే, హైదరాబాద్‌కు చెందిన నరసింహారావు– విజయలక్ష్మి దంపతులు రూ.64వేల విలువైన వెండి పళ్లెం అందచేశారు. ఈ కార్యక్రమంలో దాతల కుటుంబ సభ్యులు, ఆలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

బండి సంజయ్ వ్యాఖ్యలు సరికాదు

కొత్తగూడెంటౌన్: తెలంగాణ రాష్ట్ర బీజేపీ జిల్లా అధ్యక్షుడు బండి సంజయ్ హోంగార్డులపై అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదని హోంగార్డు అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు వి.సత్యనారాయణ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తక్షణమే తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని కోరారు. బండి సంజయ్ రాజకీయ ప్రసంగంలో చేసిన వ్యాఖ్యలు హోంగార్డుల మనోభావాలను దెబ్బతీశాయని తెలిపారు. మా సమస్యలు చర్చించకపోగా రాజకీయ విమర్శల కోసం హోంగార్డులను తక్కువ చేసి మాట్లాడటం, హేళన చేయడం సరికాదని పేర్కొన్నారు. సంజయ్ వ్యాఖ్యలను ఖండించినవారిలో అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షులు వీరయ్య, సీహెచ్ వీరయ్య ఉన్నారు.

ఎంపీ బాపూరావుపై ఏఎస్పీకి ఫిర్యాదు

భద్రాచలంటౌన్: క్రైస్తవులపై అనుచిత వ్యాఖ్యలు చేసిన ఆదిలాబాద్ ఎంపీ సోయం బాపూరావుపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని భద్రాచలం పాస్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏఎస్పీ పారితోష్ పంకజ్‌కి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షుడు పోషన్ కుమార్ మాట్లాడుతూ గత నెల 29న జరిగిన జనజాతి సురక్ష వేదికపై ఉండి క్రైస్తవులకు, పాస్టర్లకు బుల్లెట్ దింపుతా.. అంటూ వ్యాఖ్యలు చేయడంతో అందరు భయభ్రాంతులకు గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సోమయ్య, జాకోబ్, విజయ్ మోహన్, రాజేష్, దేవరాజు, పవన్‌కుమార్, ఆమోస్, హేమంత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

హెల్త్ డైరెక్టర్ చేయూత

జూలూరుపాడు: జూలూరుపాడు న్యూకాలనీకి చెందిన వేమూరి కనకయ్య భార్య సరస్వతి అనారోగ్యంతో కొన్ని రోజులుగా హైదరాబాద్ నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. పరిస్థితి విషమించి శుక్రవారం రాత్రి మృతి చెందింది. దీంతో రూ.1.75 లక్షలు ఫీజు చెల్లించి మృతదేహాన్ని తీసుకెళ్లాలని నిమ్స్ ఆస్పత్రి నిర్వాహకులు సూచించారు. సరస్వతి కుటుంబసభ్యులు దిక్కుతోచని స్థితిలో ఉండగా, జీఎస్ఆర్ ట్రస్టు సభ్యులు సమస్యను హెల్త్ డైరెక్టర్, జీఎస్ఆర్ ట్రస్టు ఛైర్మన్ డాక్టర్ గడల శ్రీనివాసరావు దృష్టికి తీసుకెళ్లారు. దీంతో స్పందించిన ఆయన తన ట్రస్టు ద్వారా ఆ ఫీజు మొత్తాన్ని చెల్లించారు. భౌతికకాయాన్ని స్వగ్రామం తరలించి చేయూతనందించారు. ట్రస్టు బాధ్యులు మోదుగు జోగారావు, చీకటి ప్రసాద్, ఎంపీపీ లావుడ్యా సోనీ, సొసైటీ ఛైర్మన్ లేళ్ల వెంకటరెడ్డి, తదితరులు మృతదేహాన్ని సందర్శించి, సంతాపం తెలిపారు.

గంజాయి కేసులో ముగ్గురు రిమాండ్

టేకులపల్లి: గంజాయి కేసులో అరెస్టైన ముగ్గురు యువకులు హైదరాబాద్ ఉప్పల్‌కు చెందిన ప్రైవేట్ ఉద్యోగి మనీష్ ఉపాధ్యాయ్, మౌలాలికి చెందిన విద్యార్థి తాండ్ర స్టాలిన్, మార్కెటింగ్ వర్కర్ తరుణ్‌గోస్వామిలను శనివారం కోర్టులో రిమాండ్ చేసినట్లు సీఐ ఇంద్రసేనారెడ్డి, ఎస్ఐ రమణారెడ్డి తెలిపారు. 18 కేజీల గంజాయిని అక్రమంగా తరలిస్తుండగా టేకులపల్లి పోలీసులు శుక్రవారం పట్టుకున్న విషయం తెలిసిందే. వారి నుంచి రెండు ద్విచక్ర వాహనాలను కూడా స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు.

సుకుమాలో ఎదురుకాల్పులు

గాయాలతో తప్పించుకున్న మావోయిస్టులు

చర్ల: సరిహద్దు ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని సుకుమా జిల్లాలో శనివారం ఉదయం జరిగిన ఎదురుకాల్పుల్లో తీవ్రంగా గాయపడిన పలువురు మావోయిస్టులు తప్పించుకున్నారు. వివరాలిలా ఉన్నాయి. సుకుమా జిల్లాలోని మారాయిగూడెం –రేగడగట్ట గ్రామాల మధ్యలోని అటవీ ప్రాంతంలో మావోయిస్టులు సంచరిస్తున్నారనే సమాచారం పోలీసులకు అందింది. దీంతో శుక్రవారం సాయంత్రం నుంచి ఛత్తీస్‌గఢ్‌కు చెందిన డీఆర్‌జీ, సీఆర్‌పీఎఫ్ బలగాలు కూంబింగ్ చేపట్టాయి. ఈ క్రమంలో శనివారం తెల్లవారు జామున పోలీసు బలగాలకు తారసపడిన మావోయిస్టులు కాల్పులు జరిపారు. పోలీసులు సైతం ఎదురుకాల్పులు జరపడంతో పలువురు మావోయిస్టులకు గాయాలైనట్లు సంఘటనా ప్రాంతంలో కనిపించిన రక్తపు మరకలను బట్టి పోలీసులు చెబుతున్నారు. ఈ ఘటనలో ఇద్దరు మావోయిస్టు పార్టీ మిలీషియా కమాండర్లు సహా పలువురు మావోయిస్టులు పాల్గొన్నారని, నలుగురికి పైగా తీవ్రంగా గాయపడి ఉంటారని పోలీసులు అనుమానిస్తున్నారు.

విద్యుత్ సమస్యలకు చెక్

- రూ 2.6 కోట్లతో సబ్ స్టేషన్ నిర్మాణ పనులు
- వచ్చే ఆగస్టులోగా నిర్మాణం పూర్తయ్యే అవకాశం
- కొత్తగూడెం పట్టణ ప్రజలకు తీరనున్న చింత


సబ్ స్టేషన్ నిర్మాణంలో భాగంగా ఏర్పాటు చేస్తున్న విద్యుత్ స్తంభాలు

కొత్తగూడెంరూరల్: వర్షం కురిసినా, గాలులు వీచినా తరచూ విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతోంది. కొత్తగూడెం పట్టణంలో ఐదారేళ్లుగా ఇదే సమస్య నెలకొంటోంది. ఈ నేపథ్యంలో జిల్లా కేంద్రంలో 132/33 సబ్ స్టేషన్ నిర్మాణం చేపట్టారు. కొద్ది నెలల్లో పనులు పూర్తయ్యే అవకాశం ఉంది. దీంతో కరెంట్ సమస్యలు తీరనున్నాయి. కొత్తగూడెంలో ఫీడర్–1, ఫీడర్–2 కింద 45 వేల మంది వినియోగదారులు ఉన్నారు. ఇక్కడికి పాల్వంచ సీతారాంపట్నంలోని 220 / 132 కేవీ సబ్ స్టేషన్ నుంచి విద్యుత్ సరఫరా చేస్తున్నారు. విద్యుత్ లైన్ జామాయిల్‌తోట, మామిడి తోట, సుబాబుల్ తోటల మీదుగా సుమారు 25 కిలోమీటర్ల మేర సాగుతుండగా, చిన్నపాటి గాలి దుమారానికి కూడా చెట్లు విరిగి కరెంట్ తీగల మీద పడి గంటల తరబడి విద్యుత్ సరఫరా నిలిచిపోంది. సరఫరా పునరుద్ధరణకు అధికారులు, సిబ్బంది అవస్థ పడాల్సి వస్తోంది. రాత్రి, పగలు తేడా లేకుండా, కొన్ని ప్రదేశాల్లోకి కాలినడకన కూడా వెళ్తూ మరమ్మతులు చేస్తున్నారు. ఈ సమస్యలకు చెక్ పెట్టేందుకు కొత్తగూడెంలో 132/33 సబ్ స్టేషన్ ఏర్పాటు చేయాలని అధికారులు 2016–17 సంవత్సరంలో ట్రాన్స్‌కోకు ప్రతిపాదనలు పంపించారు. దీంతో 2018లో రూ.2.6 కోట్లు విడుదల చేశారు. కానీ స్థలం లేకపోవడంతో సబ్ స్టేషన్ నిర్మాణ పనుల ప్రారంభంలో తీవ్ర జాప్యం జరిగింది. పలు చోట్ల వెతికినా అధిక ధర ఉండటంతో చేసేదేమీలేక లక్ష్మీదేవిపల్లి మండలం హేమచంద్రాపురం వద్ద ఉన్న ఆర్‌టీఎస్ఎస్ సబ్‌స్టేషన్‌లోనే కొత్త సబ్ స్టేషన్ నిర్మాణం చేపట్టారు. టెండర్ దక్కించుకున్న తిరుపతికి చెందిన శ్రీహరికన్‌స్ట్రక్షన్స్ కంపెనీ ఏప్రిల్ 1న నిర్మాణ పనులు ప్రారంభించింది.

2.6 కోట్లతో పనులు

స్థలం కొనుగోలు చేసి సబ్ స్టేషన్ నిర్మించాలంటే రూ.15 కోట్ల ఖర్చవుతుంది. కానీ జిల్లా విద్యుత్ శాఖ అధికారి సురేందర్, డీఈ విజయ్ కృషితో ఆర్టీఎస్ఎస్‌లోనే నిర్మాణం చేపడుతున్నారు. స్థలం కొనాల్సిన అవసరం లేకపోవడంతో సబ్ స్టేషన్ నిర్మాణం రూ.2.6 కోట్లతో పూర్తికానుంది. నిర్మాణం పూర్తయితే కొత్తగూడెం పట్టణంలోని 45 వేల మంది వినియోగదారులతోపాటు విద్యుత్ సిబ్బంది కష్టాలు కూడా తీరనున్నాయి. లోవోల్టేజీ సమస్య కూడా పరిష్కారమవుతుంది.

కరెంటు కష్టాలు తీరనున్నాయి



లక్ష్మీదేవిపల్లి మండలం హేమచంద్రపురంలో ఆర్‌టీఎస్ఎస్ సబ్ స్టేషన్‌లో 132/33 సబ్ స్టేషన్ నిర్మాణం చేపట్టాం. పనులు ఈ ఏడాది ఏప్రిల్ నుంచి ప్రారంభించాం. ఆగస్టులోగా పూర్తవుతాయి. సబ్ స్టేషన్ నిర్మాణం పూర్తయితే జిల్లా కేంద్రంలోని కొత్తగూడెం మున్సిపాలిటీ, గ్రామీణ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉండదు.

–అంజయ్య, ట్రాన్స్‌కో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్

బడిబాట విజయవంతం చేయాలి

డీఈఓ సోమశేఖర శర్మ


బడిబాట ర్యాలీలో పాల్గొన్న డీఈఓ సోమశేఖర శర్మ, ఉపాధ్యాయులు

ఇల్లెందు: పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించేందుకు చేపట్టిన బడిబాట కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని డీఈఓ సోమశేఖర శర్మ సూచించారు. శనివారం ఇల్లెందు పట్టణంలోని మెయిన్ రోడ్ హైస్కూల్ ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. అనంతరం బడిబాట కార్యక్రమాన్ని ప్రారంభించి హైస్కూల్ నుంచి మొహల్లా నంబర్ 16 పాఠశాల వరకు ర్యాలీలో పాల్గొన్నారు. పలువురు విద్యార్థుల అడ్మిషన్ పత్రాలు నింపి ఇచ్చారు. తొలిరోజు 1వ తరగతిలో 21 మందిని, 6వ తరగతిలో 20 మందిని చేర్పించారు. ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడుతూ అడ్మిషన్ల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని కోరారు. అందరికీ పాఠ్యపుస్తకాలు, యూనిఫాం పంపిణీ చేయాలన్నారు. ఈ నెల 9వ తేదీ వరకు ప్రతీ రోజు ఉదయం 7 గంటల నుంచి 11 గంటలకు వరకు ఇంటింటా ప్రచారం, ర్యాలీలు, కరపత్రాల పంపిణీ కార్యక్రమాలు చేపట్టాలన్నారు. చిన్నారులను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించేలా తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని కోరారు. ఈ నెల 12న పాఠశాలలు తెరిచాక ఆరు రోజులపాటు ప్రత్యేక కార్యక్రమం నిర్వహించాలన్నారు. 13న తొలిమెట్టు, 14న సామూహిక విద్యాభ్యాసం, 17న ఉన్నత విద్య, కెరీర్‌పై అవగాహన కల్పించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ పిల్లి శ్రీనివాసరావు, కాంప్లెక్స్ హెచ్‌ఎంలు యాదమ్మ, శారద, లాలు, నాగేశ్వరరావు, హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పరిపాలన దిశగా అడుగులు వేయాలి

- పార్టీల జెండాలు మోయడాన్ని ఇకనైనా ఆపేయాలి
- ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ


సదస్సులో మాట్లాడుతున్న మంద కృష్ణ, పక్కన నాయకులు

తల్లాడ: అణగారిన వర్గానికి చెందిన మాదిగ జాతి బిడ్డలు పార్టీల జెండాలు మోయడం ఇకనైనా ఆపేసి సొంత పార్టీని బలోపేతం చేసుకొని పరిపాలన దిశగా అడుగులు వేయాలని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ పిలుపునిచ్చారు. తల్లాడలో శనివారం రాత్రి జరిగిన ఉమ్మడి జిల్లా స్థాయి సదస్సులో ఆయన మాట్లాడారు. స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్లయినా మాదిగ జాతికి సముచిత స్థానం దక్కలేదన్నారు. రాష్ట్రంలో 19 శాతం ఉన్న మాదిగలు అంత కంటే తక్కువగా ఉన్న వారితో పోలిస్తే విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాలలో వెనుకబడ్డారని తెలిపారు. వర్గీకరణతో కొంత మేర ఉద్యోగాలు దక్కినా, తొలగించాక మళ్లీ అన్యాయమే జరుగుతోందన్నారు. ఏపీలోని తిరుపతిలో గత ఏప్రిల్‌లో జరిగిన ఎమ్మార్పీఎస్ జాతీయ సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ కోసం ఉద్యమాన్ని బలోపేతం చేయాలని నిర్ణయించినట్లు ఆయన చెప్పారు. ఈమేరకు యాభై రోజుల పాటు గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి మాదిగలను చైతన్యవంతం చేయాలని సూచించారు. రాజకీయంగా సత్తా చాటేందుకు స్థాపించిన మహాజన సోషలిస్టు పార్టీ బలోపేతానికి ప్రతీ కార్యకర్త కృషి చేయాలని మంద కృష్ణ పిలుపునిచ్చారు. తెలంగాణ ఒక శాతమే ఉన్న కేసీఆర్ వర్గమే పదవులు అనుభవిస్తుండగా, కాంగ్రెస్, బీజేపీలు సైతం వర్గీకరణ విషయంలో మోసం చేశాయని ఆరోపించారు. తొలుత తల్లాడలో మోటార్ సైకిల్ ర్యాలీ నిర్వహించగా, రింగ్ రోడ్డు సెంటర్‌లో జెండాను ఆవిష్కరించారు. ఈ సభలో ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు కూరపాటి సునీల్, నాయకులు ఏపూరి వెంకటేశ్వరరావు, కొలికపోగు వెంకటేశ్వర్‌రావు, బచ్చలకూర వెంకటేశ్వర్లు, బొర్రా భిక్షపతి, తాళ్ల సురేష్, ఎక్కిరాల నాగరాజు, గొర్ల మంగమ్మ, దారెల్లి వెంకటేశ్వరరావు, కోట బలరాం, ఇస్నేపల్లి అశోక్, రజిత, మాచర్ల క్రాంతి, కంచెపోగు సురేష్ పాల్గొన్నారు.

ఉరివేసుకుని బలవన్మరణం

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెం రైల్వే స్టేషన్ ఆవరణలోని ఒక సంఘం కార్యాలయంలో శనివారం ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. త్రీటౌన్ పోలీసుల కథనం.. పట్టణంలోని మేదరబస్తీకి చెందిన గుర్రాల శ్రీనివాస్(36) మద్యానికి బానిసై రైల్వే స్టేషన్‌లోని ఒక సంఘం ఆఫీసులో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య పాల్పడ్డాడు. అనంతరం ఆఫీసుకు వచ్చిన వారు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి


ప్రమాద దృశ్యం

పాల్వంచ: బోర్‌వెల్ వాహనాన్ని వెనుక నుంచి ట్రాలీ ఆటో ఢీకొన్న ప్రమాదంలో డ్రైవర్ మృతి చెందాడు. స్థానికుల కథనం ప్రకారం.. శనివారం పట్టణంలోని బీసీఎం రోడ్‌లో లారీ ఓనర్స్ అసోసియేషన్ హాల్ సమీపంలో బోర్‌వెల్ వాహనాన్ని వెనుక నుంచి ట్రాలీ ఆటో ఢీ కొట్టింది. దీంతో ఆటో డ్రైవర్, తెలంగాణానగర్‌కు చెందిన చింతాల వెంకటేశ్వర్లు (45) తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు చికిత్స నిమిత్తం పట్టణంలోని ఆస్పత్రికి, అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతునికి భార్య పద్మ, కుమారుడు, కూతురు ఉన్నారు. కాగా ఈ ఘటనపై తమకు ఫిర్యాదు రాలేదని పోలీసులు తెలిపారు.

కుటుంబ కలహాలతో వివాహిత ఆత్మహత్య

భద్రాచలంఅర్బన్: కుటుంబ కలహాలతో ఓ వివాహిత ఆత్మహత్య చేసుకున్న సంఘటన పట్టణంలో శనివారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. అశోక్ నగర్ కొత్త కాలనీ చెందిన జగదీష్‌కు ఏడేళ్ల క్రితం కొత్తగూడెం రైటర్ బస్తీకి చెందిన లావణ్య (28)తో వివాహం జరిగింది. కొంతకాలంగా భార్యాభర్తల మధ్య గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో లావణ్య ఒక్కతే పట్టణంలోని రామాలయం వీధిలో ఓ ఇంట్లో అద్దెకు ఉంటోంది. కుటుంబ కలహాల గురించి ఇరుగుపొరుగు వారికి చెబుతూ బాధపడుతుండేది. ఈ క్రమంలో శుక్రవారం మధ్యాహ్నం ఇంట్లోనే విషం తాగింది. స్థానికులు గుర్తించి ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ అర్ధరాత్రి సమయంలో మృతి చెందింది. మృతురాలి తల్లి గోలపూడి లక్ష్మి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

కల్యాణ మండపం రోడ్డులో మరొకరు..

కుటుంబ కలహాలతో ఓ వ్యక్తి శనివారం మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. భద్రాచలం పట్టణంలోని కల్యాణ మండపం రోడ్డుకు చెందిన ఉడతా ప్రదీప్ (40)కు 2022లో చింతూరుకు చెందిన ఓ యువతితో పెళ్లి జరిగింది. గడిచిన కొన్ని నెలలుగా దంపతుల మధ్య గొడవలు రావడంతో భార్య తల్లిగారింటికి వెళ్లిపోయింది. ప్రదీప్‌ను కూడా అక్కడికే రావాలని కోరగా అతను వెళ్లలేదు. భద్రాచలంలోనే ఉంటున్నాడు. ఈ క్రమంలో ఈ నెల 1న ఇంట్లో ఉన్న చెదలు నివారణ మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. ఆరోగ్యం కుదుట పడిందని ఈ నెల 2వ ఇంటికి తీసుకొచ్చారు. కాగా అదే రోజు ప్రదీప్ తీవ్ర అస్వస్థతకు గురై మృతి చెందాడు. మృతుడి తండ్రి వెంకటేశ్వరరావు ఫిర్యాదు మేరకు భద్రాచలం టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు.

పురుగుల మందు తాగి యువకుడు..

బూర్గంపాడు: పురుగుల మందుతాగి చికిత్స పొందుతున్న యువకుడు శనివారం మృతిచెందాడు. మండలంలోని కృష్ణసాగర్ గ్రామానికి చెందిన హరిశ్చంద్ర ప్రసాద్(22) ఈ నెల 2వ తేదీన పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. గమనించిన కుటుంబసభ్యులు భద్రాచలం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడి తండ్రి శ్రీను ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

'రైతుబంధు'కు దేశవ్యాప్త ప్రశంసలు

ప్రభుత్వ విప్ రేగా కాంతారావు


రైతును సన్మానిస్తున్న ప్రభుత్వ విప్ కాంతారావు తదితరులు

అశ్వాపురం: రైతును రాజు చేయడమే సీఎం కేసీఆర్, రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని ప్రభుత్వ విప్, పినపాక ఎమ్మెల్యే, బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు అన్నారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మండల పరిధిలోని తుమ్మలచెరువు గ్రామపంచాయతీ రైతు వేదికలో నిర్వహించిన రైతు దినోత్సవం కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రైతుబంధు పథకం దేశ వ్యాప్తంగా ప్రశంసలు పొందిందని గుర్తుచేశారు. 24 గంటల కరెంటు, రైతుబంధు, రైతు బీమా, సాగునీరు తదతర సదుపాయాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. తొలుత ప్రజాప్రతినిధులు, రైతులు ట్రాక్టర్లు, ఎడ్లబండ్లతో ర్యాలీతో ఎమ్మెల్యేకు స్వాగతం పలికారు. అనంతరం పలువురు ఆదర్శ రైతులను ఎమ్మెల్యే శాలువాతో సన్మానించి జ్ఞాపికలు అందించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, మణుగూరు డీఎస్పీ రాఘవేందర్ రావు, ఏడీఏ తాతారావు, జెడ్పీటీసీ సభ్యురాలు సూదిరెడ్డి సులక్షణ, తహసీల్దార్ రాజు, సర్పంచ్‌లు బండ్ల సంధ్యారాణి, మడకం సాధు, పర్శిక సూరిబాబు, కలేటి నరసింహారావు, ఏనిక స్వరూప, ఎంపీటీసీ తాటి పూజిత, ఏనిక రవి, అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు, రైతులు పాల్గొన్నారు.

రైతు దినోత్సవంలో కొత్త జంట నృత్యం


ప్రజాప్రతినిధులతో కలిసి నృత్యం చేస్తున్న నవ దంపతులు

అశ్వారావుపేటరూరల్: మండలంలోని నారాయణపురం గ్రామంలో శనివారం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన రైతు దినోత్సవంలో నవ దంపతులు నృత్యం చేసి ఆకట్టుకున్నారు. రాష్ట్ర ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా గ్రామంలో కోలాట నృత్యాలు, బతుకమ్మ ఆట, పాటలతో సందడి చేశారు. కాగా, గ్రామానికి చెందిన సవరం వెంకన్న కుమార్తె సాయి ప్రసన్న, దుర్గా ప్రసాద్‌లకు ఇదే రోజు పెళ్లి జరిగింది. ఈ క్రమంలో నూతన దంపతులు రైతు దినోత్సవ ర్యాలీలో స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి పాల్గొని నృత్యాలు చేసి ఆకట్టుకున్నారు. ఈ దృశ్యాల వీడియోలను కొందరు సోషల్ మీడియాలో పోస్ట్ చేయగా, వైరల్ అవుతున్నాయి.

రాష్ట్రస్థాయికి రెండు ప్రాజెక్ట్‌లు

స్కూల్ ఇన్నోవేషన్ చాలెంజ్‌కు ముగ్గురు విద్యార్థులు


ధనూష్


సందీప్


కార్తీక్

కొత్తగూడెంఅర్బన్: రాష్ట్రస్థాయిలో 2022–2023 సంవత్సరానికి స్కూల్ ఇన్నోవేషన్ చాలెంజ్ పోటీలకు జిల్లా నుంచి రెండు ప్రాజెక్టులు ఎంపికైనట్లు జిల్లా విద్యాధికారి సోమశేఖరశర్మ, జిల్లా సైన్స్ ఆఫీసర్ ఎస్.చలపతిరాజు తెలిపారు. శనివారం వారు వివరాలు వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా 70 ప్రాజెక్టులను ఫైనల్స్‌కు ఎంపిక చేశారని తెలిపారు. జిల్లా నుంచి చండ్రుగొండ మండలం పోకలగూడెంలోని జిల్లా పరిషత్ హై స్కూల్, మణుగూరులోని రామానుజవరం జిల్లా పరిషత్ హై స్కూల్ విద్యార్థుల ప్రాజెక్టులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు వివరించారు. ఇందులో మొదటిది వంటింట్లో గిన్నెలు శుభ్రం చేసేందుకు రూపొందించిన ప్రాజెక్ట్ బెల్ వాషర్స్ అని, దీన్ని పోకలగూడెం పాఠశాల విద్యార్థి బి.ధనూష్ తయారు చేశాడని తెలిపారు. రెండో ప్రాజెక్టైన బనానా ఫైబర్– ఆల్టర్నేటివ్ పేపర్‌ను మణుగూరు విద్యార్థులు సందీప్, కార్తీక్ తయారు చేశారని పేర్కొన్నారు. అరటి చెట్టు మట్టలతో పేపర్ వస్తువుల తరహాలో వస్తువులను రూపొందించారని తెలిపారు. రెండు ప్రాజెక్ట్‌లు తక్కువ ఖర్చుతో ఎక్కువ ఉపయోగం జరిగేవని, అందుకే రాష్ట్రస్థాయికి ఎంపికయ్యాయని వివరించారు. ఈ నెల 20 నుంచి 22 వరకు బూట్ క్యాంప్, గ్రాండ్ ఫైనల్ పోటీలు హైదరాబాద్‌లో జరుగుతాయని తెలిపారు. ఈ సందర్భంగా ఎంపికైన విద్యార్థులను డీఈఓ, సైన్స్ ఆఫీసర్‌తోపాటు ఎంఈఓలు జంకీలాల్, వీరస్వామి, గైడ్ టీచర్ డి.రామిరెడ్డి తదితరులు అభినందించారు. కాగా విద్యార్థులు ఈ నెల 5 నుంచి 15 వరకు ప్రాజెక్టులకు తుది మెరుగులు దిద్దనున్నారు.

రెండు బైక్‌లు ఢీ : ఇద్దరికి గాయాలు

పినపాక: రెండు బైక్‌లు ఢీకొని ఇద్దరికి తీవ్ర గాయాలైన ఘటన మండల పరిధిలోని ఏలాపురం గొట్టెల ప్రధాన రహదారిపై శనివారం రాత్రి చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం.. ఈ.బయ్యారం గ్రామానికి చెందిన గద్దం మనోహరాచారి బయ్యారం నుంచి ద్విచక్ర వాహనంపై జానంపేట వెళ్తున్నాడు. ఇదే క్రమంలో మోకాళ్ల సాగూర్ అనే వ్యక్తి మల్లారం నుంచి బయ్యారం క్రాస్ రోడ్డు వైపు మరో ద్విచక్రవాహనంపై వెళ్తున్నాడు. ఈ క్రమంలో రెండు బైక్‌లు ఢీకొని ఇద్దరికి గాయాలయ్యాయి. క్షతగాత్రులను పినపాక ప్రభుత్వ ఆస్పత్రికి, అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం మణుగూరు వందల పడకల ఆస్పత్రికి తరలించారు. పోలీసులు సంఘటనా స్థలాన్ని సందర్శించి వివరాలు సేకరించారు. దర్యాప్తు చేపట్టామని హెడ్ కానిస్టేబుల్ దిలీప్ తెలిపారు.